


# స్నేహితుడు

**మూలవాక్యము:- యోహా 15:15**

దాసుడు తన యజమానుడు చేయు దానిని ఎరుగడు గనుక ఇక మిమ్మును దాసులని పిలువక స్నేహితులని పిలుచుచున్నాను. ఎందుకనగా నేను నా తండ్రి వలన వినిన సంగతులన్నిటిని మీకు తెలియజేసితిని.

**హితుడు అనగా మేలు జరగాలని కోరుకొనేవాడు. స్నేహితుడు అనగా నిత్యము సన్నిహితముగా ఉంటూ మేలు కోరుకొనే వాడు. నిజ జీవితంలో స్నేహితుని పాత్ర ఎంతో ఉన్నతమైనది. తల్లిదండ్రులతో, అన్నదమ్ములతో, అక్క చెల్లెండ్రతో, బంధువులతో, పొరుగువారితో, వేరెవ్వరితో కూడా పంచుకోలేని ఆలోచనలు, భావాలు, రహస్యములు మనసు విప్పి మనిషి పంచుకోగలిగింది స్నేహితులతో మాత్రమే. పరిశుద్ధ గ్రంధంలో యెహోవా దేవుడు అబ్రాహామును**

స్నేహితునిగా చేసుకొని తన మనస్సులోని ఆలోచనలు తను చేయబోవు కార్యములు తెలియజేశారు.

**(ఆది 18:17),**

**(యెష 41:8).** యేసుక్రీస్తు కూడా మనలను తన స్నేహితులుగా ఉండుటకు పిలిచారు. కాబట్టి యేసయ్య కూడా జరగబోవు సంగతులు ఆయన స్నేహితులమైన మనకు బయలుపరుస్తాడు. మనము కూడా ఈ లోకంలో ఎవ్వరితోను పంచుకోలేని మన బాధలు, సమస్యలు, రహస్యములు సమస్తము యేసయ్యతో పంచుకోవచ్చు.

పరిశుద్ధ గ్రంధము యేసు క్రీస్తును పరిచయము చేస్తూ ఆయన మనకు కుమారుడుగా **(యెష 9:6 )** అనుగ్రహించబడ్డాడని తెలియజేస్తుంది. నిత్యుడగుతండ్రి **(యెష 9:6)** జ్యేష్ఠ సహోదరుని గాను **(రోమా 8:29)** విడిపించుటకు వచ్చిన సమీపబంధువుని గాను **(రూతు 3:12)** ఈ లోకానికి వచ్చారని తెలిజేస్తుంది. మరి ప్రాముఖ్యముగా ఆయన మనకందరికి స్నేహితుడు అని బోధిస్తుంది.

## I. స్నేహితులు ఎలా ఉండాలి:

### 1. స్నేహితుడు మాట్లాడాలి:- నిర్గమ 33:11

**<u>మనుష్యుడు తన స్నేహితునితో మాట్లాడినట్లు</u>** యెహోవా మోషేతో ముఖాముఖిగా మాటలాడుచుండెను. తరువాత అతడు పాళెములోనికి తిరిగి వచ్చుచుండెను. అతని పరిచారకుడును నూను కుమారుడునైన యెహోషువా అను యౌవ్వనస్థుడు గుడారములో నుండి వెలుపలికి రాలేదు.

### 2. స్నేహితులు దుఃఖ సమయములో ఓదార్చాలి:- యోబు 2:11

తేమానీయుడైన ఎలీఫజు, షూహీయుడైన బిల్దదు నయమాతీయుడైన జోఫర్ అను యోబు ముగ్గురు స్నేహితులు అతనికిసంభవించిన ఆపదలన్నిటిని గూర్చి వినిన వారై **అతనితో కలిసి దుఖిఃచుటకును అతనిని ఓదార్చుటకును** పోవలెనని ఆలోచించుకొని తమ తమ స్థలములను విడిచి వచ్చిరి.

**3. స్నేహితులు తమ స్నేహితుల నిమిత్తము ప్రార్థన చేయాలి:- యోబు 42:10**

మరియు **యోబు తన స్నేహితుల నిమిత్తము ప్రార్థన చేసినప్పుడు** యెహోవా అతని క్షేమస్థితిని మరల అతనికి దయచేసెను. మరియు యోబునకు పూర్వము కలిగిన దానికంటె రెండంతలు అధికముగా యెహోవా అతనికి దయచేసెను.

**4. స్నేహితుని స్వరం విని సంతోషించాలి:- యోహా 3:29**

పెండ్లి కుమార్తె గలవాడు పెండ్లి కుమారుడు; అయితే నిలువబడి పెండ్లి కుమారుని స్వరము వినెడి స్నేహితుడు ఆ **పెండ్లికుమారుని స్వరము విని మిక్కిలి సంతోషించును;** ఈ సంతోషము పరిపూర్ణమైయున్నది.

**5.ఏ సమయములోనైన స్నేహితునికి సహాయము చేయాలి :- లూకా 11:5**

మరియు ఆయన వారితో ఇట్లనెను మీలో ఎవనికైనను ఒక స్నేహితుండగా అతడు అర్ధరాత్రి వేళ ఆ స్నేహితుని యొద్దకువెళ్లి స్నేహితుడా, **నాకు మూడు రొట్టెలు బదులిమ్ము;**

**6. స్నేహితుడు విడువక ప్రేమించాలి:- సామె 17:17**

**నిజమైన స్నేహితుడు** విడువక ప్రేమించును. దుర్దశలో అట్టివాడు సహోదరుడుగా నుండును.

**7. స్నేహితుడు సహోదరుని కంటె ఎక్కువగా హత్తుకొని ఉండాలి:- సామె 18:24**

బహు మంది చెలికాండ్రు గల వాడు నష్టపడును. **సహోదరుని కంటెను ఎక్కువగా హత్తియుండు స్నేహితుడు కలడు.**

**8. స్నేహితుడు మేలు కోరి గాయములు చేయాలి:- సామె 27:6**

**మేలును కోరి స్నేహితుడు గాయములు చేయును**. పగవాడు లెక్కలేని ముద్దులు పెట్టును.

**9. స్నేహితుని కోసం ప్రాణం పెట్టాలి:- యోహా 15:13**

**తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువాని** కంటె ఎక్కువైన ప్రేమ గలవాడెవడును లేడు.

## II. పరిశుద్ధ గ్రంథంలో కొంత మంది స్నేహితులు ఎలా ఉన్నారో గమనిద్దాం:

❖ **ఎగతాళి చేయుచున్న స్నేహితులు:- యోబు 16:20**

**నా స్నేహితులు నన్ను ఎగతాళి** చేయుచున్నారు.

❖ **నమ్మకూడని స్నేహితులు:- యోబు 6:15**

నా స్నేహితులు ఎండిన వాగు వలెను మాయమైపోవు జల ప్రవాహముల వలెను **నమ్మకూడని వారైరి.**

❖ **మరిచిపోయిన స్నేహితులు:- యిర్మీ 30:14**

**నీ స్నేహితులందరు నిన్ను మరచియున్నారు,** వారు నిన్ను గూర్చి విచారింపరు.

❖ **పడిపోతే చూడవలెనని కనిపెట్టుకొనియున్న స్నేహితులు:- యిర్మీ 20:10**

నలుదిక్కుల భయము అని అనేకులు గుసగుసలాడగా వింటిని. వారు దుర్మార్గుడని మీరు చాటించిన యెడల మేమును చాటింతుమందురు; అతడొకవేళ చిక్కుపడును, అప్పుడు మనమతని పట్టుకొని అతని మీద పగతీర్చుకొందమని చెప్పుకొనుచు, **నాకు స్నేహితులైన వారందరు నేను పడిపోగా చూడవలెనని కనిపెట్టుకొనియున్నారు.**

❖ **తప్పుడు సలహాలు ఇచ్చిన స్నేహితులు:- ఎస్తే 5:14**

అతని భార్యయైన జెరెషును అతని **స్నేహితులందరును ఏబది మూరల ఎత్తు గల యొక ఉరి కొయ్య చేయించుము;** దాని మీద మొర్దకై ఉరి తీయింపబడునట్లు రేపు నీవు రాజుతో మనవి చేయుము; తరువాత నీవు సంతోషముగా రాజుతోకూడ విందునకుపోదువు అని అతనితో చెప్పిరి. ఈ సంగతి హామానునకు యుక్తముగా కనబడినందున అతడు ఉరికొయ్య యొకటి సిద్ధము చేయించెను.

❖ **బాధ కలిగించిన స్నేహితులు:- యోబు 16:2**

ఇట్టి మాటలు అనేకములు నేను వినియున్నాను **మీరందరు బాధకే కర్తలు** గాని ఆదరణకు కర్తలు కారు.

❖ **చంపుటకు అప్పగించు స్నేహితులు:- లూకా 21:16**

తల్లిదండ్రుల చేతను, సహోదరుల చేతను, బంధువుల చేతను, స్నేహితుల చేతను మీరు అప్పగింపబడుదురు; వారు **మీలో కొందరిని చంపింతురు.**

**స్నేహితులు కూడా అనేక సందర్భాలలో స్వార్థపరులుగాను విలువలు లేని స్నేహితులుగాను ఉన్నారు. గనుక ఈ లోకంలోనికి యేసు క్రీస్తు స్నేహితునిగా వచ్చారు.**

## III. యేసయ్య ఎలాంటి స్నేహితుడో వాక్యములో గమనిద్దాం:

**నిజమైన స్నేహితుడు:- సామె 17:17**

**నిజమైన స్నేహితుడు** విడువక ప్రేమించును. దుర్దశలో అట్టివాడు సహోదరుడుగా నుండును.

**విడువని స్నేహితుడు:- సామె 17:17**

నిజమైన స్నేహితుడు **విడువక ప్రేమించును.** దుర్దశలో అట్టివాడు సహోదరుడుగా నుండును.

**కాలిన అరణ్యములో స్నేహించిన స్నేహితుడు:- హోషే 13:5**

మహా యెండకు కాలిన అరణ్యములో నిన్ను స్నేహించినవాడను నేనే.

**ప్రాణమిచ్చిన స్నేహితుడు:- యోహా 15:13**

తన స్నేహితుల కొరకు తన ప్రాణము పెట్టువాని కంటె ఎక్కువైన ప్రేమ గలవాడెవడును లేడు.

## ALERT:-

- **తండ్రి స్నేహితుని విడిచిపెట్టకూడదు:- సామె 27:10**

నీ స్నేహితునినైనను నీ తండ్రి స్నేహితునినైనను విడిచి పెట్టకుము. నీకు ఆపద కలిగిన దినమందు నీ సహోదరుని యింటికి వెళ్లకుము. దూరములో నున్న సహోదరుని కంటె దగ్గరనున్న పొరుగు వాడు వాసి. **సామె 19:4** ధనము గలవానికి స్నేహితులు అధికముగా నుందురు, దరిద్రుడు తన స్నేహితులను పోగొట్టుకొనును.

**హెచ్చరిక:-**

- **ముఖ్య స్నేహితుల యందు నమ్మిక యుంచవద్దు:- మీకా 7:5**

స్నేహితుని యందు నమ్మిక యుంచవద్దు ముఖ్య స్నేహితుని నమ్ముకొనవద్దు, నీ కౌగిటిలో పండుకొనియున్న దాని యెదుట నీ పెదవుల ద్వారమునకు కాపుపెట్టుము.

**ముగింపు:-**

ముద్దు పెట్టి తనను అప్పగించిన ఇస్కరియోతు యూదాను కూడా స్నేహితుడా అని పిలిచిన గొప్ప స్నేహితుడు, మంచి స్నేహితుడు యేసు క్రీస్తు.

- **యేసు క్రీస్తు ఇస్కరియోతు యూదాను స్నేహితుడా అని పిలిచాడు:- మత్త 26:50**

యేసు చెలికాడా, నీవు చేయ వచ్చినది చేయుమని అతనితో చెప్పగా వారు దగ్గరకు వచ్చి ఆయన మీద పడి ఆయనను పట్టుకొనిరి.

అవసరమైతే నీ కొరకు నా ప్రాణమైన ఇస్తాను అని చెప్పే స్నేహితులను అందరు కలిగియుంటారు. కాని అవసరమైనప్పుడు ఆపదలో ఉన్నప్పుడు ఆదుకొనే స్నేహితులు కొందరే కలిగియుంటారు. నువ్వు అడగక మునుపే నీ అక్కరలన్నిటిని యెరిగి వాటిని తీర్చువాడు నీ స్థానంలో ప్రాణం పెట్టిన గొప్ప వాడు యేసు క్రీస్తు. గనుక ప్రాణమిచ్చిన యేసయ్యను నీ ప్రాణ స్నేహితునిగా కలిగియుండుట నీకెంతో ప్రయోజనకరమని తెలియజేస్తున్నాను.

**అట్టి కృప పరిశుద్ధాత్మ దేవుడు మనకనుగ్రహించును గాక.**